క్లుప్తంగా

పైప్‌లైన్ నిర్మాణం ప్రారంభం



పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ కార్యవర్గం, అధికారుల సహకారంతో పట్టణంలోని మౌలిక వసతుల కల్పన పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. స్థానిక 19వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ వార్డులో రూ.5 లక్షలతో సాధారణ నిధుల నుంచి 550 మీటర్ల మేర తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టామని లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు ఇంద్రా ప్రియదర్శిని, అచ్యుతరామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు, బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, మురళి, ఇంజినీరింగ్ సెక్రటరీ సునీల్, మనోజ్‌లు పాల్గొన్నారు.

ముగ్గురాళ్ల వాగు వద్ద ప్రమాద హెచ్చరిక



వాగు వద్ద నిర్వహిస్తున్న పోలీస్ పికెట్

టి.నరసాపురం: భారీ వర్షాలకు బండివారిగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య ముగ్గురాళ్ల వాగు పొంగి ప్రవహిస్తోంది. ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. తహసీల్దార్ టి.సాయిబాబా, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించారు. ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ విజయరాజు

చింతలపూడి : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభ విజయరాజు గురువారం ఆరోపించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్, అధికార సిబ్బంది అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని తెలిపారు. దొంగ ఓట్లు వేశారని తమ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన ఏజెంట్లను కూడా పోలింగ్ బూత్‌లోనికి రానివ్వకుండా, కనీసం అభ్యర్థులు కూడా ఓట్లు లేకుండా అడ్డుకున్నారని విమర్శించారు.



కంభ విజయరాజు

పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్ జరుగుతుంటే అధికార యంత్రాంగం ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలను రద్దుచేసి కేంద్ర సాయుధ బలగాల పర్యవేక్షణలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తన ప్రతిష్టను, నిజాయతీని కాపాడుకోవాలంటే ఈ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించిన ప్రభుత్వ అధికారులపై విచారణ చేసి ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు. పులివెందులలో టీడీపీకి వచ్చిన ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లను ఒక్కసారి పరిశీలిస్తే అక్కడ రిగ్గింగ్ జరిగిందనేది స్పష్టం అవుతుందని వివరించారు. కేవలం జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలవడానికి అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటని తెలిపారు. ఈ ఎన్నికలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం పతనం అవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

ప్రజలను మోసం చేసిన బాబు



క్యూ ఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

టి.నరసాపురం: హామీలను తుంగలో తొక్కి చంద్రబాబు ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. టి.నరసాపురం మండలం బందంచర్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు ఇంటి వద్ద బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ వాల్ పోస్టర్‌ను గురువారం ఆయన విడుదల చేశారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సభలో బాలరాజు మాట్లాడుతూ రైతు భరోసా రెండు సంవత్సరాలకు రూ.40 వేలు చెల్లించాల్సి ఉండగా, రూ.5 వేలు ఇచ్చి చంద్రబాబు చేతులు దులుపుకున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి రాజ్యాంగానికి తూట్లు పొడిచారని, ప్రజలకు చంద్రబాబు మోసం అర్థమైందని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, ఎటువంటి పరిస్థితులునైనా ఎదుర్కొంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో శ్రీనురాజు, వాసిరెడ్డి మధు, సర్పంచ్ గుండె వెంకటేశ్వరరావు, పార్టీ ఎస్సీ సెల్ నిరీక్షణరావు, నాయకులు ఆచంట కుటుంబరావు, కనిపెడ నాగేశ్వరరావు, తూము సత్యనారాయణ, చందనాల శ్రీను, ఉమ్మడి తేజ, తిరుమలదేవిపేట దాసరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు



బుట్టాయగూడెం : కండ్రికగూడెంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం : హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కళాశాల రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ వారం రోజులపాటు ఘనంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం కళాశాలలో నిర్వహించామన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను అర్థశాస్త్ర అధ్యాపకులు వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గులు, ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ గాళ్ల శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కండ్రికగూడెంలో తిరంగా ర్యాలీ

బుట్టాయగూడెం: మండలంలోని కండ్రికగూడెం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలని, ఆగష్టు 15న ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో తిరంగా ర్యాలీ నిర్వహించినట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. నాయకులు కోసూరి నరేష్, దొమ్మేటి జనార్ధన్‌రావు, వంకా కాంచనమాల, దయ్యాల సీతారామాంజనేయులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

మసీదు సామగ్రి దహనం హేయం

చింతలపూడి : ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం దూపాడు గ్రామంలో ఈనెల 13న రాత్రి అతి పురాతన మసీదులో ఉన్న సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేయడం హేయమైన చర్య అని జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు ఎస్‌కే అజాద్ బాబు అన్నారు. గురువారం ఆయన చింతలపూడిలో విలేకరులతో మాట్లాడుతూ మసీదులో ఉన్న నమాజు చదివే జానిమాజులు, విలువైన వస్తువులను దహనం చేశారని, ఏసీలు ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని చెప్పారు. ఇది కావాలనే చేసిన పని అని ఆరోపించారు. ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదులు, చర్చి, ఆలయాలపై ఇలాంటి నీచమైన పనులు చేయడానికి భయపడేలా శిక్ష విధించాలని విజ్ఞప్తి చేశారు.



ఎస్‌కే అజాద్ బాబు

వెండి వస్తువుల చోరీ

జంగారెడ్డిగూడెం: వెండి వస్తువులు చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక శ్రీ సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కర్రి శ్రీరామరెడ్డి, తన భార్య కంటి ఆపరేషన్ నిమిత్తం ఈ నెల 8న ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లారని, 14వ తేదీ ఉదయం తమ ఇంటి తాళం పగులగొట్టి ఉందని స్థానికులు చెప్పడంతో వచ్చారని చెప్పారు. బీరువాలో ఉంచి సుమారు 7 కేజీల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బాధితుడు శ్రీరామరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం బండారువారి వీధికి చెందిన బండారు సుబ్బారావు ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంటికి తాళాలు వేసి తన భార్యతో కలిసి తాడువాయి వెళ్లాడని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. తిరిగి 13వ తేదీ ఉదయం ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాలోని బంగారు చైను, చెవి దుద్దులు, మ్యాటీలు సుమారు 4 కాసుల బంగారం చోరీకి గురయ్యాయని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

మహిళపై దాడి

జంగారెడ్డిగూడెం సౌజన్యపేటలో ఉంటున్న జువ్వల నాగమణి తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న మడకం వెంకటేశ్వరరావు, మడకం లక్ష్మి, మడకం పోతురాజు, మరో ఇద్దరు ప్రతి విషయంలో తనను ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అసభ్య పదజాలతంతో తిడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 12న తాను ఇంటి వద్ద ఉన్న సమయంలో ఇంటిపైకి రాళ్లు విసిరారని, దీంతో తన మోకాలికి గాయమై, ఆసుపత్రిలో చికిత్స పొందానని నాగమణి తెలిపారు. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం: స్థానిక పురపాలక సంఘం పట్టణ ప్రణాళిక విభాగంలో అనధికార లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీము ద్వారా అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ తెలిపారు. స్కీమ్ వివరాలను వివరించారు. పట్టణ పరిధిలో 30 జూన్ 2025 నాటికి ముందుగా రిజిస్ట్రేషన్ అయిన అనధికార లే అవుట్లకు ఈ అవకాశం ఉందని తెలిపారు. ఈ స్కీమ్ జూలై 26న ప్రారంభమైందని, 90 రోజుల్లో ప్లాట్ యజమానుదారులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆ కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలి

బుట్టాయగూడెం: బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి ప్రాణాలు కోల్పోయిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, ఆ సంఘ న్యాయ సలహాదారు అయినారపు సూర్యనారాయణలు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. బ్రిటిష్‌వారితో పోరాడిన కారుకొండ సుబ్బారెడ్డి, ఆయన అనుచరుల వివరాలను ప్రభుత్వం సేకరించాలని, వారి కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. అలాగే కేఆర్‌పురం ఐటీడీఏకు కారుకొండ సుబ్బారెడ్డి పేరును పెట్టాలని కోరారు. ఆదివాసీ మహాసభ ప్రతినిధులు రామాల యాకోబు, మిడియం వెంకటేష్, ముచ్చిక భాస్కర్ పాల్గొన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం జయప్రకాష్ నారాయణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేపీ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చదరంగం పోటీలను స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ప్రారంభించారు. సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో కేఎస్ఎస్ కార్తీక, కె.రాంబాబు, జూనియర్స్‌లో ఎం.కుశాంక్, వి.శ్రీ ఆద్య, సబ్ జూనియర్స్‌లో కె.నేహా శ్రీ హర్ష, పి.శివనాగు విజయం సాధించారని, వీరికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జేపీ సెంటర్లో జరిగే పాటల పోటీల అనంతరం బహుమతి ప్రదానం చేయనున్నట్టు జేపీ యూత్ సభ్యులు తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రమణ

విర్డ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ద్వారకాతిరుమల: విర్డ్ ఆస్పత్రి సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక విర్డ్ ఆస్పత్రిని ఈఓతో కలిసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ (ఏలూరు జిల్లా) పక్కల కాళిదాసు, ద్వారకాతిరుమల స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ మీనా కుమార్‌లు గురువారం సందర్శించారు. అనంతరం ప్రోస్థాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌ను 22 మంది దివ్యాంగులకు అందజేశారు. విర్డ్ ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణ మూర్తి, ఎస్‌వీఎస్ఎన్ నివృతరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు ఉన్నారు.



కృత్రిమ అవయాలను అందిస్తున్న దృశ్యం

దుస్తుల పంపిణీ

లింగపాలెం : మండలంలోని భోగోలులో గురువారం ప్రజలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గెడ్డం సత్యం అండ్ సన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీఎం హైస్కూల్ బిషప్ జాన్ ఎస్‌డీ రాజు చేతులమీదుగా ఈ కార్యక్రమం చేపట్టారు. పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన స్థానిక హైస్కూల్ విద్యార్థిని ఎల్.నిఖితకు రూ.10 వేలు చెక్కు అందించారు. తమ ఫౌండేషన్ ద్వారా గ్రామంలో వివాహం చేసుకునే మహిళలకు కళ్యాణ లక్ష్మి పేరిట ఇస్తున్న రూ.5400 సాయాన్ని రూ.7200కు పెంచుతున్నామని, దీంతో పాటు పట్టుచీర కూడా ఇవ్వాలని నిర్ణయించామని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. తమ తండ్రి గెడ్డం సత్యం మృతిచెందినప్పటికీ ఆయన పేరిట సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన కుమారులు చెప్పారు.



నిఖితకు చెక్కు అందిస్తున్న బిషప్

సొసైటీ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

పోలవరం రూరల్, లింగపాలెం: పోలవరం మండలం కృష్ణారావుపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా కె.ప్రసాద్, లింగపాలెం మండలం ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్‌గా ఎస్.సుధాకర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు.